## సమ్మోహనం పద్య వైభవం!




ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక తెలుగు సోదర కవులు చక్కని కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు, సాహితీ ప్రియుడు గన్నవరపు మూర్తి అలనాటి స్వాతంత్ర్య ఉద్యమం, తెల్లవారి దుష్కృత్యాల గురించి గద్య పద్యాత్మకంగా వినిపించారు. అంతకు ముందు జువ్వాడి రమణ మాట్లాడుతూ, అష్ట దిగ్గజాలలో ప్రముఖుడు, కాళీ వరప్రసాది అయిన తెనాలి రామకృష్ణుడి 'గంగా సంగమమిచ్చగించునె' పద్యం వినిపించారు. ధూర్జటి, నంది తిమ్మనల ప్రాశస్త్యం గురించి చక్కని పద్యాలతో ఆయన వివరించారు.

అమెరికా అవధానిగా ప్రసిద్ధుడు, వృక్షశాస్త్రజ్ఞుడు పూదూరు జగదీశ్వరన్ తిరుపతి వేంకట కవుల పట్ల తనకు ఉన్న అపారమైన భక్తిని ప్రకటించారు. ప్రత్యేకంగా గురువు లేకపోయినా స్వయంకృషితో అవధాన విద్యను నేర్చినట్లు ఆయన ప్రకటించుకున్నారు. వాగ్దేవి, సరస్వతి, రాముడు, శివుని మీద ఆయన మంచి పద్యాలు వినిపించారు. తెనాలి రామకృష్ణునిదిగా చెబుతున్న 'కప్ప' అరుపు గురించి చక్కని పద్యం పాడారు.